
ప్రజాశక్తి
గురువారం 9 ఫిబ్రవరి 2023
5
శ్రీ సత్యసాయి





వెంకటరెడ్డిపల్లి సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న పేద రైతులు



అనంతపై సోలార్ కన్ను..!

- లక్షల ఎకరాలు దారదత్తానికి ప్రభుత్వం సిద్ధం
- పెద్ద ఎత్తున భూ కేటాయింపునకు చర్యలు
- పలు మండలాల్లో భూమి గుర్తింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం క్షామ పీడిత ప్రాంతంగా ఉన్న అనంతపురం జిల్లాలో ఇక్కడి ప్రజల జీవనం దుర్భరంగా మారింది. వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేసి నష్టాలను చవిచూస్తున్న రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరికొంత మంది ఇక్కడ బతుకుదెరువు లేదంటూ బెంగళూరు, కేరళ తదితర రాష్ట్రాలకు పొట్టచేతబట్టుకుని వలసలు పోతున్నారు. ఇదిలాఉంటే ప్రకృతి వైపరీత్యం మరికొంత మందికి కాసులు కురిపించే విధంగా మారడం గమనార్హం. ఇక్కడి వర్షాభావ పరిస్థితులు సోలార్ విద్యుత్ ఉత్పత్తికి వరంగా మారింది. ఎత్తు ప్రాంతంగా ఉండి గాలులకు మేఘాలు తెలిపోయి వర్షాలు పడని పరిస్థితులు నెలకుని ఉండగా, ఇది పవన విద్యుత్ ఉత్పత్తికి వరంగా మారింది. దీంతో ఇప్పుడు సోలార్, పవన విద్యుత్ కంపెనీల కన్ను అనంతపురం జిల్లాపై పడింది. పెద్దఎత్తున ఈ కంపెనీలు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకుని కాసులు కురిపించుకుంటున్నాయి. మరికొన్ని కంపెనీలు సైతం ముందుకొచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో లక్షలాది ఎకరాల భూములు ఇప్పుడు కంపెనీల పరం కానున్నాయి.

4811.89 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో చూసినప్పుడు పవన, సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్ల ద్వారా జరుగుతున్న విద్యుత్ ఉత్పదాన 4811.89 మెగావాట్లుగా ఉంది. ఇందులో అనంతపురం జిల్లా పరిధిలో పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2628 మెగావాట్లు కాగా, సత్యసాయి జిల్లాలో 375.24 మెగావాట్లు ఉంది. ఇక అనంతపురం జిల్లా పరిధిలో సౌర విద్యుత్ 612.57 మెగావాట్లు కాగా, సత్యసాయి జిల్లా పరిధిలో 1193 మెగావాట్లు ఉంది. మొత్తంగా రెండు జిల్లాల పరిధిలో ఇప్పటికే 4811.89 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటై ఉన్నాయి.

పెద్దఎత్తున భూ కేటాయింపులకు రంగం సిద్ధం

సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం ఇప్పుడిచ్చిన భూములే కాకుండా ఇంకా పెద్దఎత్తున భూ పందేరానికి ప్రభుత్వం సిద్ధపడినట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాల పరిధిలో పది వేల ఎకరాల వరకు గుర్తించే ప్రక్రియ ప్రారంభమైంది. ఇదే నియోజకవర్గం పరిధిలో మొత్తం 75 వేల ఎకరాలు ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు సమాచారం. ఇకపోతే సత్యసాయి జిల్లా పరిధిలో తలుపుల, ఎన్పికుంట, కడప జిల్లాలోని చక్రయాపేట పరిధిలో మొత్తం 20 వేల ఎకరాలు ఇవ్వడానికి అనుకూలంగా ఉన్నట్టు గుర్తించారు. ఓబుళదేవం చెరువు మండలం, నల్లమాడ, ఆమడగూరు మూడు మండలాల పరిధిలో 12 వేల ఎకరాలు సోలార్ పార్కుకు అనుకూలంగా గుర్తించారు. కంబదూరు మండలం పరిధిలోని రాళ్ల అనంతపురం, రాళ్లపల్లి, కురాకులపల్లి గ్రామ పరిధిలో మరో 12 వేల ఎకరాలు అనుకూలంగానున్నట్టు గుర్తించారు. ఇలా అనేక చోట్లపెద్దఎత్తున సోలార్‌కు అను కూలమైన భూమలున్నట్టు గుర్తించారు. వీటిని ముందుకొచ్చే కంపెనీలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైనది చెప్పవచ్చు.

సాగుదారులకు పట్టాలివ్వండి

వ్యకాసం ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న పేద సాగు రైతులందరికీ వెంటనే పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాలోని పలు సచివాలయాల వద్ద బుధవారం నాడు ఆందోళన చేపట్టి, సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. పెనుకొండ నగర పంచాయితీ పరిధిలోని వెంకటరెడ్డి పల్లి సచివాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాగుదారులందరికి అసైన్మెంట్ చేసి భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇస్లాపురం గ్రామానికి చెందిన దళితులు,వెనకబడిన వర్గాలకు చెందిన భూమిలేని 120 నిరుపేద కుటుంబాలు గొందిపల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 164లోని దాదాపు 300 ఎకరాల భూమిని చేసుకుంటున్నారన్నారు. పరిశీలించి సాగుదారులందరికీ ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన 8వ విడత భూ పంపిణీలో అసైన్మెంట్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు జయంతి, రామాంజనమ్మ, సాగుదారులు రాజు, బైలాంజనేయులు, అంజి, రాజశేఖర్, నాగరాజు, సురేష్, రత్నమ్మ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రానికి చెందిన భూమిలేని దళిత, వెనుకబడిన వర్గాలకు ఎనిమిదో విడత భూ పంపిణీలో పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు బాధితులు స్థానిక రెండవ సచివాలయంలో బుధవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు హనుమయ్య, వెంకటేష్, రంగప్ప, కొండా వెంకటేశులు, సాగుదారులు శ్యామల, గంగమ్మ, అమత, అలివేలమ్మ, సరోజ, వరలక్ష్మి, నాగమ్మ, శివమ్మ, సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : భూ పంపిణీ కార్యక్రమాన్ని అసైన్మెంట్ కమిటీ ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తామని సాగుదారులకే భూమిని పంపిణీ చేస్తామని తహశీల్దార్ దేవేంద్ర నాయక్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సునీత బాయ్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో భూ పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. కొండగుట్టలకు భూపంపిణీలో ఆస్కారం లేదన్నారు. సాగు చేసుకుంటున్న వారికే భూ పంపిణీ చేస్తామన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలోని అధికారులు, ప్రతినిధుల కమిటీ ద్వారా ఈ పంపిణీ సాగిస్తామన్నారు. ఎంఇఒ వేమ నారాయణ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ సచివాలయానికి ఒక ప్రత్యేక విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. బడి మానేసిన విద్యార్థులను ఈ విద్యా కేంద్రంలో చేరేలగా అధికారులు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. రబీ సాగు పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని సుమతి కోరారు. రైతు సంఘాల సభ్యులు ప్రభుత్వం అందించే ట్రాక్టర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు కాలసముద్రం సూర్యనారాయణ, ఎంపీడీవో రామచంద్రారెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని కోగిర గ్రామానికి చెందిన 75 దళిత, వెనకబడిన వర్గాలకు చెందిన భూమిలేని నిరుపేద కుటుంబాలు కోగిర రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 666 – 669లోని దాదాపు 180 ఎకరాలను సాగు చేసుకుంటున్నారని వీరిని భూమిని పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సాగుదారులతో వ్యక్తిగత అర్జీలను సచివాలయం అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, సాగుదారులు జయమ్మ , రజిత, రత్నమ్మ, భారతి, నరసమ్మ , లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.


డిఇఒతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

డిఇఒ వైఖరిపై ఎస్ఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి మడకశిర రూరల్

డిఇఒ వైఖరిపై ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఈరేష్ మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల వైఖరిపై వినతిపత్రం ఇవ్వటానికి వెళితే డిఇఒ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. కనీసం వినతిపత్రం తీసుకోవటానికి కూడా ఆసక్తి చూపకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిందన్నారు. స్థానికజ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో అనేక సమస్యలు నెలకొన్నాయని వాటిని పరిష్కరించాలని కోరామన్నారు. అలాగే ప్రయివేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్దంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశామన్నారు. అయితే ఈ విషయంలో డిఇఒ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. 'సమస్యలు మీరు చెప్పాల్సిన అవసరం లేదు.. చెప్పడానికి మీరెవరు,,' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారన్నారు. నియోజకవర్గంలో కొన్ని పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఈ విషయంపై డిఇఒ చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. డీఈవో వైఖరిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. సమస్యలు చెప్పడానికి వెళ్లిన నాయకులపై డిఇఒ అనుసరించిన వైఖరిని తాము ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి రొద్దం

టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సును మండలంలోని కల్లుకుంట గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా చట్టాలను తెలియజేసే నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఇఒ లావణ్య, అధ్యక్షురాలు కిష్టమ్మ, వైస్ ప్రెసిడెంట్ రామలక్ష్మమ్మ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అన్నదానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్ కాచర్ల లక్ష్మి, కాచర్ల అంజి దంపతుల కుమర్తె కాచర్ల యశశ్విని పుట్టిన రోజు సందర్భంగా బిఎస్ఆర్ బాలికల పాఠశాలలో బుధవారం నాడు విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బిఎస్ఆర్ పాఠశాలలో చదువుతున్న యశశ్విని తోటి విద్యార్థుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలను జరుపుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం గొట్లూరు అనాథాశ్రమం, శివాలయాల్లో శివస్వాములు దాదాపు రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కాచర్ల అంజి కుటుంబ సభ్యులు

జెండా ఆవిష్కరణ

సోమందేపల్లి : పశ్చిమ బెంగాల్ లో ఈనెల 15 నుండి 18 వ తేదీ వరకు నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘ అఖిలభారత మహాసభల నేపథ్యంలో సంఘీభావంగా మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నిరుపేదలందరికీ భూమి, ఇల్లు ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు రోజు రూ. 600 కూలి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రాజగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, రైతులు అంజనమ్మ, లక్ష్మీదేవి, వెంకటేష్, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెద్దాం


విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి ముదిగుబ్బ

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావటానికి కలసికట్టుగా కృషి చేద్దామని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసి రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తులసీరెడ్డి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి చిత్తుచిత్తుగా ఓడిపోతుందని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతోందని విమర్శించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మూడు లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని 500 రూపాయలకే వంటగ్యాస్ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈసమావేశంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు నిషార్ అహ్మద్, హరి ప్రసాద్, రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు చేపట్టాలి

కదిరి టౌన్ : ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు చేపట్టాలని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్ బాబు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం దళిత అభివద్ధి సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన 27 సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమని విమర్శించారు. ఈ మేరకు నాయకులు బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అలాగే తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పలక ఆంజనేయులు, మోరుపూరి శివప్రసాద్, ప్రేమలత, విశ్వనాథ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

అండర్ - 14 విభాగంలో వశిష్ట పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఓబుల దేవర చెరువు : శ్రీకాకుళం జిల్లాలో జరిగిన అండర్ – 14 పరుగు పందెం విభాగంలో స్థానిక వశిష్ట పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపర్చారు. ఈ పోటీల్లో యశోద అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి జట్టుకు ఎంపికైంది. ఇటీవల కొనకొండ్లలో జరిగిన అండర్ –14 క్రికెట్ విభాగంలో ఆర్. అభినయ్ అనే విద్యార్థి విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి జట్టులో చోటు సంపాదించారు. భారతీయ ఇంజనీరింగ్ అండ్ సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ (బీస్ట్) ఆధ్వర్యంలో గోరంట్ల మండలం గౌనివారిపల్లిలో జరిగిన ఖొ ఖ , కబడ్డీ పోటీలలో వశిష్ట పాఠశాల బాలుర జట్టు , బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచారు. వశిష్ట పాఠశాలలో విజయోత్సవ వేడుకల్లోమోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ వరప్రసాద్ ప్రతిభా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీ పిట్ట శివశంకర్ రెడ్డి, హెచ్ఎం ఎం. జయసింహా రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం పరిమళించిన వేళ...

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మతిస్థిమితం లేక గడ్డం పెరిగి బట్టలు మాసి రోడ్ల వెంట తిరుగుతూ ఎవరైనా పెడితే తింటూ ఎన్నో రోజులు స్నానం చేయని వ్యక్తిని చేరదీసి మానవత్వాన్ని చాటుకోన్న కిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను పలువురు ప్రశంసించారు. అందుకు సంబంధించిన వివరాలు... పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చిన వీర్రాజు అనే వ్యక్తి పుట్టపర్తిలో చాలా రోజులుగా తిరుగుతున్నాడు. మాసిన బట్టలతో పెరిగిన గడ్డంతో ఎవరైనా దయ తలచి అన్నం పెడితే తింటూ లేదంటే పస్తులు ఉంటూ రహదారుల వెంట తిరుగుతూ ఉండేవాడు. ఈ విషయం గమనించిన ఛారిటబుల్ సభ్యులు బుధవారం అతనికి గడ్డం తీయించి, స్నానం చేయించి కొత్త దుస్తులు వేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శామీర్, అలీ, ట్రాఫిక్ కానిస్టేబుల్ బాబ్జాన్, సాదిక్, చాంద్‌బాషా, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మతిస్థిమితం లేని వ్యక్తికి సపర్యలు చేస్తున్న ట్రస్టు సభ్యులు


అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్

కట్టుదిట్టంగా ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కేతన్‌గార్గ్ పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కడప, అనంతపురం, కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ఓట్లు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపునకు సరైన గదులు ఎంపిక చేసే నిమిత్తం అనంతపురం నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలను బుధవారం పరిశీలించారు. జిల్లాకు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ, వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని పరిశీలించారు. సరైన బారికేట్లతో ఏర్పాట్లు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి, సీసీ కెమెరాలు ఎల్లవేళలా పనిచేసేలా చూడాలన్నారు. కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు వీడియోగ్రఫీని ఏర్పాటు చేయాలన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన సూచనలు మేరకు కౌంటింగ్ సక్రమంగా జరపాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులకు కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎంజెబిలో వైద్యశిబిరం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని ఎంజెబి పాఠశాలలో డాక్టర్ ఎం జగదీష్ బాబు ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎంజెబి పాఠశాలలో విషజ్వరాలు శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డాక్టర్ జగదీష్ బాబు ఆధ్వర్యంలో పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి అనారోగ్యంతో ఉన్న విద్యార్థులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసులు, ప్రభాకర్, రూప, ఐశ్వర్య , మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రమణతో పాటు ఎంజెబి ప్రిన్సిపల్ గోపాల్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఇసుకరీచ్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

పరిగి : మండలంలోని జయమంగళీ నది వద్ద ఇసుక రీచ్ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పరిగి మండల టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం నది సమీపంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ మండలంలో గత కొన్నేళ్లుగా తాగడానికి నీరు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుత అరకొర వర్షాలతో తాగునీటి ఎద్దడి తగ్గిందన్నారు. ఈ సమయంలో నదిలో ఉన్న ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తే స్థానికులు అనేక ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరప్ప, చౌడప్ప, గంగాధర్, నేతలపల్లి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో రాహుల్ నాయక్ ప్రతిభ

నల్లమాడ : మండల పరిధిలోని వేళ్ళ మద్ది గ్రామ సర్పంచ్ డుంగవత్ బొజ్జేనాయక్ మనవడు రాహుల్ నాయక్ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనపర్చాడు. 86శాతం మార్కులు సాధించి తన ప్రతిభ చాటాడు. రాహుల్ ప్రతిభ పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

పంచాయతీ కార్మికులకు కిట్లు పంపిణీ

పరిగి : మండలంలోని కోడిగేనహళ్లి పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పని వేళల్లో వినియోగించుకోవడానికి కొబ్బరి నూనె, సబ్బు తదితర వాటితో కూడిన కిట్లను సర్పంచ్ శ్రీ రామప్ప, కార్యదర్శి నారాయణ బుధవారం పంపిణీ చేశారు.కార్మికులు పనివేళల్లో తప్పనిసరిగా వీటిని వినియోగించుకోవాలని వారు సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

చిలమత్తూరు : జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు వారి కుటుంబాలకి జనసేన పార్టీ అండగా ఉంటుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసుధన్ రెడ్డి అన్నారు. గత ఏడాది జరిగిన ప్రమాదంలో చిలమత్తూరు మండలం పలగలపల్లి గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త మంజునాథ్ మృతిచెందాడు. దీంతో మృతునికుటుంబానికి జనసేన పార్టీ తరుపున రూ. 5 లక్షల విలువైన చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టిసి. వరుణ్, చిరంజీవి, హిందూపురం నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్, జిల్లా కార్యదర్శి రమణ, సహాయకార్యదర్శి ఆనంద్‌కృష్ణ, ఈశ్వరయ్య, పత్తి చంద్రశేఖర్, చిన్నాప్రవీణ్, అగ్గిశ్రీనివాసులు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలలో వైద్యశిబిరం

లేపాక్షి : మండల పరిధిలోని నవోదయ పాఠశాలలో వైద్య అధికారి వెంకట చిరంజీవి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పరిశుభ్రత పైఅవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల పాల్గొన్నారు.

వేగవంతంగా రీ సర్వే

హిందూపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమాన్ని సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, విఆర్‌ఓలు కలిసి వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. రీ సర్వేలో హిందూపురం పురపాలక సంఘం చాల వెనుకబడి ఉందని, వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ అధికారులు ఆదేశించిన నేపథ్యంల మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆద్వర్యంలో మున్సిపల్ కార్యలయ ఆవరణంలో కంప్యూటర్లు ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసి, సర్వే పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎసిపి ఆనంద్ బాబు, రెవిన్యూ అధికారి రంగరావు, ఆర్‌ఐలు రాము, రామాంజి, సచివాలయ సుపర్‌వైజర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటి రంగంలో ఉద్యోగావకాశాలు

పెనుకొండ : ఐటి రంగంలో ఉన్న ఉద్యోగవకాశాల గురించి ఐటి నిపుణులు మదన్ వివరించారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోకామర్స్ విభాగం తరపున కెరీర్ గైడెన్స్ సెల్ కు సంబంధించి కళాశాల ప్రిన్సిపల్ ఎన్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మదన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఐ టి రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జయప్ప, చెన్నారెడ్డి, హరీష్ బాబు, కామర్స్ విభాగాధిపతి ఓబిలేసు, బాలారెడ్డి, ఫర్నాజ్,విష్ణువర్ధన్ రాజు పాల్గొన్నారు.

15న బహిరంగ వేలం

కదిరి టౌన్ : మార్చి 2వ తేదీనుంచి 16వ తేదీ వరకు నిర్వహించే కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో దుకాణాలు నిర్వహించుకునేందుకు ఈనెల 15న కదిరి మున్సిపల్ కార్యాలయం నందు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెండర్‌లో పాల్గొనదల్చినవారు 3 లక్షల రూపాయల ధరావతు చెల్లించాలని కోరారు.

అనుమతిచ్చిన అధికారిపై చర్యలకు డిమాండ్

హిందూపురం : పట్టణంలోని నింకంపల్లి రోడ్డులోని బాలయేసు కళాశాల ఎదుట ఉన్నా పచ్చని చెట్లు నరకడానికి అనుమతి ఇచ్చిన మున్సిపల్ ఎఇ సురేష్‌పై చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్త భాస్కర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు. పట్టణంలో అధికారులు, పాలకులు ఒక పక్క చెట్టు నాటండి...వాటిని పరిరక్షించండి అని చెబుతుంటే మరో పక్క వాటిని రక్షించాల్సిన ఇంజనీయర్ అతనికి సంబంధం లేకున్న అనుమతులు ఇవ్వటం ఏమిటని ప్రశ్నించారు.

బాధితుడికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం మల్లయ్య గారి పల్లి కి చెందిన వైసిపికి చెందిన సానే రమణా రెడ్డి ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైసిపి సిఇసి సభ్యులు పూల శ్రీనివాస్ రెడ్డి బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. తనవంతు సాయంగా రూ. 50వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ లీగల్ సెల్ నాయకుడు లోకేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బాహుద్దీన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బత్తలపల్లి : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎపి కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ కోటి సుధ, సర్పంచు సక్కిం కాశమ్మ, ఎంపీటీసీ కోటి నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజాసమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య అంబులెన్సు ప్రారంభం : స్థానిక శివాలయం ముందు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య అంబులెన్సును జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపిపి గుర్రం వనజతో కలసి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాహనాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శుభదాసు, ధర్మవరం డివిజన్ డీడీ డాక్టర్ చంద్రశేఖర్, టీడీ శ్రీనివాస రావు, పశు వైద్యాధికారి గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం : బత్తలపల్లి గ్రామ సచివాలయం-1ను జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బుధవారం ప్రారంభించారు. రూ. 10 లక్షల అంచానా వ్యయంతో నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీవో సాయిమనోహర్, సర్పంచు అక్కిం కాశమ్మ, ఎంపీటీసీ కోటి నరేష్, కార్యదర్శి ఉమాదేవి, నాయకులు కమతం ఈశ్వరయ్య, బండి వీరానారప్ప, గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బుగ్గిరి బయపరెడ్డి, ఉప సర్పంచి కోటి గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ

హిందూపురం : పురపాలక సంఘంలోని 16వ వార్డు రహమత్‌పురం ప్రాంతంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇక్బాల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ, వైస్‌ఛైర్మన్ జబివుల్లా, వార్డు ఇన్‌చార్జ్ సలీం, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పుట్టపర్తిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



పెనుకొండలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

విదేశీ విద్య పథకాన్ని కుదించటం అన్యాయం

పుట్టపర్తి అర్బన్ : వైసిపి ప్రభుత్వం నిబంధనల పేరుతో బడుగు బలహీన వర్గాలను విదేశీవిద్యకు దూరం చేస్తోందని టిడిపి నాయకులు విమర్శించారు. వాల్మీకి సాధికారిక జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ కొండయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గోరంత సాయం చేసి కొండంత గొప్పలు చెబుతోందన్నారు. సంపన్న వర్గాలతో సమానంగా బడుగు బలహీన వర్గాలకు కూడా విదేశీ విద్యను అందించడానికి గత టిడిపి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసిందన్నారు. తాము అధికారంలోకి వస్తే విదేశీ విద్యకు రూ. 20 లక్షలు ఇస్తామని గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడున్నర ఏళ్లుగా ఈ పథకాన్ని అటకెక్కించారన్నారు. నిబంధనలు సరళం చేసి బడుగు బలహీన వర్గాల పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామ కోటి ఆదినారాయణ, బీసీ సెల్ నాయకులు కోడపగాని పల్లి శివ, బండ్లపల్లి రాజు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మాల మనోహర్, కప్పల బండ సర్పంచి పెద్దన్న, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, వాల్మీకి సాధికారిక సమితి రాష్ట్ర సభ్యులు గిరిధర్ గౌడ్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి : విదేశీ విద్య పథకాన్ని నిబంధనల పేరుతో కుదించటం అన్యాయమని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పూజారి రాజకృష్ణ, ఎంపిటిసి బిల్లే భాస్కర్, పూజారి నాగభూషణం, వడ్ల సుబ్రహ్మణ్యం, కాసుమూర్తి వెంకటేష్, ఎస్సీ సెల్ కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : వైసిపి ప్రభుత్వ హయాంలో బడుగు బలహీన వర్గాల పిల్లలకు విదేశీవిద్య అందని ద్రాక్షలా మారిందని టిడిపి నాయకులు విమర్శించారు. పేద విద్యార్థులకు విదేశీ ఉన్నత విద్యను దూరం చేసిన జగన్ రెడ్డి నిరంకుశ పాలను నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా టిడిపి ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిసం రామాంజనేయులు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గంగాద్రి ఆధ్వర్యంలో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శ్రీధర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు మోపూరి అంజనప్ప, రంగప్ప, పుట్టపర్తి నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి నర్సింహులు, కార్యదర్శి బావన్న తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : విదేశాలకు వెళ్లి చదువుకునే పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ మండల టిడిపి నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్ కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి వేణు. ఉపాధ్యక్షులు జయరాం, గిరిధర్ గౌడ్, సుబ్బరాయుడు, రామచంద్ర, నరేష్ కుమార్ యాదవ్, రవి నాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

రొద్దం : పేద విద్యార్థులకు విదేశీ విద్య దూరం చేయడాన్ని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ మండల నాయకులు బుధవారం స్థానిక తహశీల్దార్ అనంతచారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నప్పయ్య, మురళి, సాయి కిరణ్, చంద్రశేఖర్,అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : వైసిపి ప్రభుత్వం పేద విద్యార్థులకు విదేశీ విద్య దూరం చేస్తోందని ఆరోపిస్తూ టిడిపి నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, నరసింహమూర్తి, అశ్వర్థ, కృష్ణ, ఆనంద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : వైసీపీ పాలనలో పేద విద్యార్థులకు విదేశీ విద్య దూరం అవుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, వినతిపత్రాన్ని సమర్పించారు.అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశ్వర్థప్ప, హుజూర్, సాయి ప్రసాద్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రాష్ట్రం అప్పులమయం : పల్లె

కొత్తచెరువు : రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సబ్సిడీల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని పోతులకుంట గ్రామంలో బుధవారం నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికలలో వైసిపి తగిన మూల్యం చెల్లించుకక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు మాజీ సర్పంచులు వెంకటరమణప్ప, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయిలో 'పాంచజన్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆదాయపన్ను శాఖ అధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీ పరీక్షల్లో పాంచజన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపర్చారు. మంగళవారం తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఆదాయపన్ను శాఖ రాష్ట్ర కమిషనర్ బాలకృష్ణ, ప్రొఫెసర్ రాజరెడ్డి, కోటేశ్వరమ్మ చేతుల మీదుగా మెమోంటో, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభా కనబర్చిన విద్యార్థులను బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో పాంచజన్య శ్రీనివాసులు, పాఠశాల కరెస్పాంటెండ్, సెక్రటరీ నందకుమార్, హెచ్ఎం గాయిత్రి, ఎహెచ్‌ఎమ్‌లు విజయేంద్ర, శశికళ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా విద్యార్థులను అభినందిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు, తదితరులు

మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



మార్ట్‌ను ప్రారంభిస్తున జెడ్పీ ఛైర్‌పర్సన్, తదితరులు

ప్రజాశక్తి బత్తలపల్లి

మహిళా సంఘాల సభ్యులందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న భారతీ చేయూత మహిళా మార్ట్ ద్వారా మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కురుబ రాష్ట్ర కార్పోరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తాడిపత్రి రోడ్ లో మహిళా సంఘాల సభ్యులు 22 లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన భారతీ చేయూత మహిళా మార్ట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న భారతీ చేయూత మహిళా మార్ట్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళా మార్ట్ లో నాణ్యమైన సరుకులను తక్కువ ధరకే అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, జెడ్పీటీసీకోటి సుధ, ఎంపీపీ గుర్రం వనజ, వైసిపి అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్ రెడ్డి, కమతం ఈశ్వరయ్య జయరాం రెడ్డి, మహిళా మార్ట్ ప్రతినిధులు రామాంజనమ్మ, ప్రభు కుమారి, ఈశ్వరమ్మ, మహిళా సంఘాల సభ్యులు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు అందించాలి : మహిళా సంఘాల సభ్యులందరూ కలిసి షేర్ క్యాపిటల్ ద్వారా ఏర్పాటు చేసుకున్న భారతీ చేయూత మహిళా మార్ట్ ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు అందించాలని జిల్లా కలెక్టర్ పి.బసంత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన భారతీ చేయూత మహిళా మార్ట్‌ను బుధవారం పరిశీలించి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. మార్కెట్ ధరలకన్నా తక్కువకే నాణ్యమైన నిత్యావసర వస్తువులను గ్రామీణులకు అందించేందుకు ప్రభుత్వం మరో కార్యాచరణను సిద్ధంచేసిందని, ఇందులో భాగంగా పొదుపు సంఘాల మహిళల ఆధ్వర్యంలో మండలాల వారీగా 'చేయూత' మహిళా సూపర్ మార్కెట్లను ఏర్పాటు చేయనుందని చెప్పారు. దశల వారీగా అన్ని మండలాల్లో మండలానికి ఒకటిన్నొప్పున ఈ మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



బస్సును ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-హిందూపురం

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారిని వారి గమ్య స్థానాలకు చేర్చడమే లక్ష్యంగా ఆర్‌టిసి పని చేస్తోందనిఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్, ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుళ పేర్కొన్నారు. హిందూపురం నుంచి హైదరాబాద్, హైదరబాద్ నుంచి హిందూపురం తిరిగే రెండు ఇంద్ర బస్సులను వారు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వైసిపి ప్రభుత్వం చెప్పిన విధంగా ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబివుల్లా, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

శిరివరంలో ఉన్నవి వక్ఫ్‌బోర్డు ఆస్తులే..

ప్రజాశక్తి - లేపాక్షి

మండలంలోని శిరివరం గ్రామంలో ఉన్న వక్ఫ్‌బోర్డు ఆస్తులు ప్రయివేటు వ్యక్తులకు ఎలాంటి సంబంధం లేదని వక్ఫ్‌బోర్డు జిల్లా అధికారి గౌస్‌మోద్దీన్ తెలిపారు. వారం రోజుల క్రితం శిరివరం గ్రామంలో ఉన్న స్థానిక జామియా మసీద్ ఆవరణంలో కమిటీ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డ్‌కు సంబంధించిన భూముల్లో ఉన్న చింతచెట్ల ఫలసాయాన్ని వేలం వేయడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో ఈస్థలం తమకు చెందిందని వేలం పాటను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో వక్ఫ్ బోర్డు ఇన్స్‌పెక్టర్ బుధవారం శిరివరం గ్రామాన్ని సందర్శించి ఇరువర్గాలను విచారించారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిశీలించారు. ఈస్థలం వక్ఫ్‌బోర్డుకు చెందినదని దీంతో వచ్చే ఆదాయంతో జామియా మసీద్ అభివద్ధి చేసుకోవాలని సూచించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

భారీఎత్తున గంజాయి పట్టివేత

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లా సెబ్ అధికారులు భారీ స్థాయిలో గంజాయిని స్వాధీనం చేసుకుని పదిమంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయి స్వాధీనం కేసు వివరాలను వెల్లడించారు. పోలీసులకు అందించిన పక్కా సమాచారం మేరకు ముదిగుబ్బ రైల్వే స్టేషన్లో రైలు దిగుతున్న పదిమందిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుండి ఒక్కొక్కటి రెండు కేజీలు ఉన్న 18 ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ పదిమందిలో రెండు గ్రూపులు ఉండగా ఒకదానికి సాకే గణేష్, మరొక దానికి వనం నగేష్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరితో పాటు వీరభద్రయ్య, సరోజ, ఆవుల రమణమ్మ, సీన, ఆంజనేయులు, మిథున్ అనే వ్యక్తులు తుని వద్ద గంజాయిని ఒక్కొక్క కేజీ 3వేల రూపాయలతో కొనుగోలు చేసి మరొక బృందానికి 6వేల రూపాయలకు అమ్ముతున్నట్లు తమ విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. పట్టుబడిన పదిమంది ముఠా సభ్యులను వద్దనుండి 36 కేజీల గంజాయిని, 36వేల రూపాయల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

పేరూరులో రస్తా వివాదం

రామగిరి : మండలంలోని పేరూరులో గ్రామంలో రస్తా వివాదం నెలకొంది. బడిగ నాగభూషణ అనే వ్యక్తికి సంబందించిన భవనాన్ని అదే గ్రామానికి చెందిన లాయర్ నాగిరెడ్డి కూల్చివేయించాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.. మంగళవారం రాత్రి జరిగిన ఈఘటనకు సంబందించి బడిగ నాగభూషణం తెలిపిన వివరాలు... గ్రామంలోనిబడిగ నాగభూషణంకు చెందిన ఖాళీస్థలంలో దారి కావాలని లాయర్ నాగిరెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ఈ రస్తా విషయంపై కోర్టులో వాజ్యం నడుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నాగిరెడ్డి జెసిబితో స్థలంలో ఉన్న భవనం, సిసి కెమెరాలు, బోర్డును ధ్వంసం చేసినట్లు బడిగ నాగభూషణం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ జనార్ధననాయుడు, పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

గొయ్యిలోకి దూసుకెళ్లిన ఐచర్

బత్తలపల్లి : అనంతపురం కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రి సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఐచర్ వాహనం గోతిలోకి దూసుకుపోయింది. ఈసందర్భంగా పెను ప్రమాదం తృటిలో తప్పింది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు... తమిళనాడు నుంచి గుత్తికి టెంకాయలను తీసుకువెళుతున్న ఐచర్ వాహనం బత్తలపల్లికి చేరుకోగానే డ్రైవర్ అనిల్ నిద్రమత్తులో తూలాడు. దీంతో ఐచర్ వాహనం అదుపుతప్పి డివైడర్లను ఢీ కొంది. జాతీయ రహదారి పై ఎడమ వైపు వస్తున్న ఐచర్ వాహనం అదుపుతప్పి కుడి వైపునకు వెళ్లి గోతిలోకి దూసుకుపోయింది. ఈ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఐచర్ వాహనంలో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు. అతనికి స్వల్పగాయాలు అయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బత్తలపల్లి : అనంతపురం- కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని తంపాపురం క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని నల్లబోయనపల్లికి చెందిన అభిరామ్ రెడ్డి తన ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళుతున్నాడు. ఇదే సమయంలో దంపెట్లకు వెళ్లేందుకు వేచి ఉన్న డి. చెర్లోపల్లి విఆర్ఎ గంగాధర్ అభిరాం ద్విచక్రవాహనంలో ఎక్కాడు. తంబాపురం క్రాస్ వద్ద విద్యుత్‌స్తంభం తీసుకెళుతున్న ట్రాక్టర్ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ఉన్న అభిరాంరెడ్డి, గంగాధర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. వీరిలో గంగాధర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

గుత్తి : కట్టుకున్న భార్యను హత్య చేసిన కేసులో భర్త ఖాజాను బుధవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గుత్తి పట్టణంలోని మారుతి నగర్‌లో నివాసం వుండే డ్రైవరు ఖాజా తన భార్య జుబేదాబీ ని డబ్బు కోసం వేధించి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టిన సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ ఆర్.శ్రీనివాసులు ఖాజాను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు వారు తెలియజేశారు.

125 లీటర్ల నాటుసారా స్వాధీనం

గుత్తి : మండలంలోని ఉబిచెర్ల గ్రామం వద్ద సెబ్ అధికారులు 125 లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. కర్నూలు జిల్లా మిద్దె తండాకు చెందిన రమేష్ నాయక్ నాటుసారా తరలిస్తుండగా సెబ్ సీఐ బి.వరలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం దాడులు చేశారు. నాటుసారా విక్రేతను అరెస్టు చేసి అతని వద్ద ఉన్న 125 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు.

గుత్తి ఉప తహశీల్దార్ హాజీవలి మృతి

గుత్తి : గుత్తి మండలం ఉప తహశీల్దార్ కె.హాజీవలి బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. హాజీవలి గతంలో గుత్తి ఇన్‌ఛార్జి తహశీల్దారుగా విధులు నిర్వహించారు. కొన్నేళ్లుగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. అనంతపురంలోని సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. ఉప తహశీల్దారు మృతికి రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. తాడిపత్రిలోని ఉప తహశీల్దారు నివాసంలో ఉన్న పార్థివదేహాన్ని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షులు సిబి.మంజునాథరెడ్డి, వైసీపీ నాయకుడు వై.రామ సుబ్బారెడ్డి సందర్శించి నివాళులర్పించారు.